

కథ

ఆదుర్తి బాల

# పెళ్ళిభోజనం

"ఏమండీ... మా మామయ్య కూతురు పెళ్లిట శుభలేఖ వచ్చింది" ఆఫీసు నుంచీ అపుడే వచ్చిన మొగుడికి శుభలేఖ అందిస్తూ అన్నది అనంతలక్ష్మి.

అలాగా అంటూ శుభలేఖ అందుకొని చదవసాగాడు అప్పారావు. పెళ్లి ఏ రోజునో చదివాక "అయ్యో... అరెరె.." అన్నాడు నాలిక బైటపెట్టి కొరుక్కుంటూ.

"ఏమైందండీ" అంది అనంతలక్ష్మి భర్త ప్రవర్తన అర్థం కాక.

"ఏం చెప్పమంటావు అనంతం. అదే రోజు అంటే మీ మామయ్య కూతురి పెళ్లి రోజే ఇక్కడ రెండు పెళ్లిళ్లకి శుభలేఖలొచ్చాయి. వెళ్లక తప్పదు" అన్నాడు అప్పారావు విచారంగా.

"ఎవరండీ వాళ్లు" అన్నది అనంతలక్ష్మి.

"ఒకటి నా మొగుడి కూతురి పెళ్లి అంటే మా మేనేజర్ కూతురు. ఇంకొకటి నా బాల్య స్నేహితుడి కొడుకు పెళ్లి"

"ఓస్ అంతేకదా.. ఎంతైనా బంధువుల తరువాతే స్నేహితులు కదా. మా మామయ్య కూతురి పెళ్లికెళ్లడం ఖాయం. మీరింకేం మాట్లాడకండి" ఫైనల్ జడ్జిమెంట్ చదివిన జడ్జిలా అన్నది అనంతలక్ష్మి.

అప్పారావుకి ఏం చెప్పాలో తెలీక బుర్ర గోక్కున్నాడు. మేనేజర్‌కి అసలే పట్టింపు ఎక్కువ. వాళ్లింట్లో పెళ్లికి మానడం కుదరదు. అలాగని భార్యకి ఎదురు చెప్పలేడు. కాసేపు మెదడుకి పదును పెట్టగా ఫ్లాష్‌లా వెలిగిందో ఐడియా!

"అదికాదురా అనంతం! మీ మామయ్య కూతురి పెళ్లి ఎక్కడో హైదరాబాద్‌లో కదా జరిగేది. మనిద్దరం అంత దూరం వెళ్లాలంటే అక్కడికి పోనూరానూ ప్రయాణం ఖర్చులూ, ఆటో ఖర్చులూ కలిపి పదిహేను వందలకి తక్కువ అవదు. అదీగాక పెళ్లి మీ వైపు వాళ్లది కనుక నువ్విచ్చే గిఫ్ట్ కూడా భారీగానే ఉంటుంది. ఎటొచ్చీ మొత్తం రెండు వేలకి తక్కువ కాదు కదా. అదే ఈ ఊళ్లో పెళ్లి అనుకో ఆ ఖర్చులన్నీ కలిసొచ్చినట్టేగా. పైగా గిఫ్ట్ మనం ప్రత్యేకంగా కొనక్కర్లేదు. ఆఫీసు స్టాఫంతా తలా వందా వేసుకొని కొంటున్నారు. కాబట్టి ఆ వంద ఖర్చూ తప్పితే మనకింకేం ఖర్చూ ఉండదు. మిగిలిన డబ్బు పెట్టి నువ్వు ఏ చీరో కొనుక్కోవచ్చు" భార్య ముఖకవళికలని పరిశీలిస్తూ అన్నాడు అప్పారావు.

చీర కొనుక్కోవచ్చు అనేసరికి అనంతలక్ష్మి మెత్తబడిపోయింది. పైకి మాత్రం "పోనీలెండి మీరు నోరు తెరిచి అడుగుతున్నారుగా పాపం - మీ మాట కాదనలేకపోతున్నాను. మా మామయ్యకేదో సర్దిచెప్పుకుంటాలెండి గానీ వాళ్లకి మ్యారేజ్ విషెస్ చెబుతూ ఓ టెలిగ్రాం కొట్టండి. అన్నట్టు నా చీర కోసం మిగల్చుకున్న డబ్బులు ఇలా ఇచ్చేయండి మరి" అన్నది.

"నీ ముందు మార్వాడీ వడ్డీవ్యాపారి కూడా పనికిరాడు" భార్య చేతిలో డబ్బు పెడుతూ అనుకున్నాడు అప్పారావు.

"ఇంతకీ ఒకే రోజు ఒకే ముహూర్తానికి రెండు పెళ్లిళ్లు కదా ఏ పెళ్లికెళ్లాలి మనం" అన్నది అనంతలక్ష్మి.

"ఇంకెవళ్లదీ మా మేనేజర్ కూతురి పెళ్లికే" అన్నాడు అప్పారావు.

"పాపం మీ స్నేహితుడు ఏమనుకుంటాడో" అన్నది అనంతలక్ష్మి.

"వాడసలే మధ్యతరగతి వాడు. పెళ్లి భోజనమంటే ఏం పెట్టగలడు. ఏవో రెండు కూరలూ, బూరెలూ, పులిహోరా, సాంబారూ తప్ప. అవి పండుగలూ పబ్బాలకి మనం చేసుకుని తినేవేగా. అదే మా మేనేజర్ అనుకో. వాడికసలే గొప్పలెక్కువ. ఏ స్టార్‌హోటల్‌లోనో భోజనాలు పెట్టిస్తాడు. అసలా భోజనం వైభవమే వైభవమనుకో. ఆయన కొడుకు పెళ్లి విందు గురించి ఇప్పటికీ ఆఫీసులో చెప్పుకుంటారు. వంద రూపాయలతో ఇద్దరం హాయిగా తినిరావచ్చు"

"అబ్బ మీకెంత తెలివండీ" రెండు చేతులూ ముందుకు చాపి అప్పారావు ముఖం ముందు గుండ్రంగా తిప్పి మెటికలు విరిచింది అనంతలక్ష్మి.

* * *

ఆ రోజే అప్పారావు మేనేజరు కూతురి పెళ్లి. ఉదయం పదకొండు గంటలకి ముహూర్తమైతే తెల్లవారుఝాము నుంచే తయారవ్వడం మొదలుపెట్టింది అనంతలక్ష్మి. సెనగపిండిలో పెరుగేసి ఇంకా ఏవేవో కలిపి ఫేస్‌పాక్ వేసుకుంది. షాంపూతో స్నానం చేసింది. తలవెంట్రుక నుంచి కాలిగోరు వరకూ ప్రత్యేక శ్రద్ధతో అలంకరించుకుంది.

అప్పారావుకి కడుపులో ఎలకలు పరిగెత్తడం మొదలుపెట్టాయి. భార్య టిఫినో, కాఫీనో చేస్తుందని ఆశగా చూశాడు. అద్దం ముందు నుంచొని తయారవుతున్న అనంతలక్ష్మికి ఆకలిదప్పుల స్పృహ ఉన్నట్టు కనిపించలేదు. 'అద్దం ముందు నిలబడితే చాలు. ఇంట్లో దొంగలు పడ్డా తెలీదు ఈ ఆడవాళ్లకి' కోపంగా అనుకొని వంటింట్లో డబ్బాలు వెతుక్కున్నాడు అప్పారావు తినడానికేమైనా దొరుకుతుందేమోనని. ఏమీ దొరకలేదు. ఇంక లాభం లేదనుకొని వీధి చివర ఉన్న ఇడ్లీ బండి దగ్గరకెళ్లి రెండు పేట్ల ఇడ్లీలు పార్శిల్ చేయించుకొచ్చాడు.

"అనంతం.. ఇలా వచ్చి ఈ రెండు ఇడ్లీలూ తిని నీ మేకప్ కంటిన్యూ చెయ్యి" కుర్చీలో కూర్చుని తన ఇడ్లీ పొట్లం విప్పుతూ అన్నాడు.

"ఆ టేబుల్ మీద పెట్టండి. అయిపోయిందిలెండి ఇంక చీర కట్టుకుని వచ్చెయ్యడమే" లోపల్నించి సమాధానంగా అన్నది అనంతలక్ష్మి.

'హు ఇంకో అరగంట పడుతుందన్నమాట' అని నిట్టూరుస్తూ తన ఇడ్లీలు తినేసి పడక్కుర్చీలో వెనక్కివాలాడు అప్పారావు. నీరసంగా ఉన్న కడుపులో కాస్త తిండి పడేసరికి కళ్లు మూతలు పడ్డాయి అప్పారావుకి.

"ఏవండీ.. ఏవండీ ఈ మేకప్పులో బాగున్నానా చెప్పండి" మొగుడి మీదకి వంగి కుదిపేస్తూ అడిగింది అనంతలక్ష్మి.

ఉలిక్కిపడి లేచాడు అప్పారావు. కళ్లు నులుపుకుంటూ అనంతలక్ష్మి వంక చూశాడు.

"ఎవరు.. ఎవరమ్మా మీరు అలా మీద పడతారేంటి. దూరంగా జరగండి మా ఆవిడ చూస్తే బాగోదు" బెదిరిపోతూ అన్నాడు.

"నేనండీ మీ అనంతాన్ని. కళ్లు బాగా తెరిచి చూడండి" పకపకా నవ్వి అన్నది అనంతలక్ష్మి.


"నువ్వా? ఈ మేకప్పులో ఉన్న నిన్ను గుర్తుపట్టలేదు సుమా" అన్నాడు అప్పారావు.

ఇద్దరూ స్కూటరెక్కి కల్యాణమండపానికి బయలు

దేరారు.

అప్పారావు సతీసమేతంగా ఫంక్షన్‌హాల్‌లోకి అడుగుపెట్టాడు. హవుస్‌ఫుల్ అయిన సినిమా హాలులాగా ఫంక్షన్ హాలంతా క్రిక్కిరిసిపోయింది. ఒక్క కుర్చీ కూడా ఖాళీగా దొరకలేదు. ఇంతలో అప్పారావు ఫ్రెండొకడు రెండు కుర్చీలు తెప్పించి అప్పారావు దంపతుల కోసం వేయించాడు. అతడికి థాంక్స్ చెప్పి కల్యాణ వేదిక వైపు దృష్టి సారించాడు అప్పారావు. రకరకాల హైబ్రీడ్ గులాబీలు, మెరుపు కాగితాలు, పూలదండలతో అద్భుతంగా అలంకరించబడి ఉందది. వేదిక డెకరేషన్ ఖర్చే ముప్ఫై వేలైందిట అంటున్నారెవరో. ఆ కల్యాణ వేదికమీద లైట్ల వెలుగులో పెద్దంచు పట్టుచీరలు కట్టుకుని వంకీలు, వడ్డాణాలు పెట్టుకొని నాటకాల్లో లక్ష్మీదేవి వేషం వేసుకున్నట్టుగా తయారై అటూఇటూ తిరుగుతున్నారు ఆడవాళ్లు.

అనంతలక్ష్మి వంక ఓరగా చూశాడు అప్పారావు. ఆ నగల డిజైన్ని, శారీన్ని తన కంప్యూటర్ మెదడులో నిక్షిప్తం చేసుకుంటున్నట్టు అనిపించి గుండె గుభేల్మంది అప్పారావుకి. ఇంటికెళ్లాకా ఏ నగలకి, చీరలకి టెండరు పెడుతుందోనని! పెళ్లికూతురూ, పెళ్లి కొడుకూ కనిపించడం లేదెవరికీ. వధూవరుల చుట్టూ వీడియోల వాళ్లూ, ఫోటోగ్రాఫర్లు మూగిపోయి రకరకాల భంగిమల్లో ఫోటోలు తీసేస్తున్నారు. వాళ్లని. ఫోటోగ్రాఫర్ల కాళ్ల సందుల్లోంచో, వీడియో వాళ్లు చేతులు కొంచెం పైకెత్తినప్పుడు అప్పుడప్పుడూ పెళ్లికొడుకు మొహమో, పెళ్లికూతురి చీరో కాస్త కనిపించాయి అప్పారావుకి. భజంత్రీలు, మేళాలు ఒక్కసారి పెద్దగా మోగాయి. ముహూర్తం టైమైంది. జీలకర్రా బెల్లం పెట్టారు అన్నారెవరో. భోజనాలు పెడుతున్నారు అన్నారు. జనాలందరూ గుంపులుగా లేస్తున్నారు. క్షణాల్లోనే హాలులో మూడు వంతులు ఖాళీ



అయిపోయింది. ఎవరికి వారు తినేసి బైటపడిపోవాలని ఆత్రపడిపోతున్నారు.

"పదండి మనం కూడా వెడదాం" అన్నది అనంతలక్ష్మి.

"ఇంకా సూత్రధారణ కాలేదుగా" అన్నాడు అప్పారావు.

"ఆ సంగతి వాళ్లకి తెలీదా. ముందర వెళ్లకపోతే కుర్చీలు దొరకవు. అయినా ఈ రోజుల్లో సూత్రధారణ దాకా ఎవరాగుతున్నారూ పదండి పదండి నలుగురితో పోటీ మనమూనూ" భర్తని తొందరపెట్టింది అనంతలక్ష్మి.

డైనింగ్ హాల్లో అడుగుపెట్టారు అప్పారావు, అనంతలక్ష్మి. అక్కడ ఆ విశాలమైన హాలు కూడా జనంతో నిండిపోయింది. ఓ పొడుగాటి ప్లాట్‌ఫాం మీద రకరకాల స్వీట్లు, హాట్లు, తినుబండారాలు పెద్దపెద్ద పాత్రలలో పెట్టబడి ఉన్నాయి. ఓ పక్కగా పెద్ద పింగాణీ ప్లేట్లు దొంతరలుగా పెట్టబడి ఉన్నాయి. వచ్చిన వాళ్లందరూ తలో ప్లేటూ తీసుకొని లైన్లో నిలబడుతున్నారు. అప్పారావు, అనంతలక్ష్మి చెరో ప్లేటూ తీసుకొని లైనులో నుంచున్నారు. ప్లేటు చాపిన వారందరికీ కాటరింగ్ సర్వీస్ వాళ్లు పాత్రలలో ఉన్న పదార్థాలు వడ్డిస్తున్నారు. జైల్లో ఖైదీలకు అన్నం వడ్డించడం గుర్తొచ్చింది అప్పారావుకి. బిరియానీ, ఫ్రైడ్ రైస్, ఆలూకూర్మా, బాదం హల్వా ఇంకా రకరకాల కూరలూ, పచ్చళ్లూ పళ్లెం నిండా వేయించుకొని చివరగా మంచినీళ్ల గ్లాసు పుచ్చుకొని ఎక్కడైనా కూర్చోడానికి చోటు దొరుకుతుందేమోనని చూశాడు అప్పారావు. అక్కడక్కడా కుర్చీలూ, టేబుల్స్ వేశారు గానీ అవి వచ్చిన వాళ్లకి సరిపోక చాలామంది నిలబడే తింటున్నారు.

"హు ఒక్కడుగు ముందరొస్తే కుర్చీలు దొరికేవి. సూత్రధారణ కాలేదంటూ లేటు చేశారు" మొగుడి మీద విసుక్కుంది అనంతలక్ష్మి.

"ఇదేమైనా పరుగుపందెమా ముందు పరుగెత్తుకు రావడానికి" అన్నాడు అప్పారావు.

"లేకపోతే పాతకాలంలోగా బొట్టెట్టి చేయి పట్టు

కొని తీసుకెళ్లి విస్తరి ముందు కూర్చోపెడతారా ఏం.. బఫే అయినా పంక్తి భోజనాలైనా ముందొచ్చిన వాళ్లకే చోటు దక్కుతుంది ఈ రోజుల్లో. మీ ఫ్రెండు శేషావతారంగార్ని చూడండి. పెళ్లి హాల్లో ఇందాకటి వరకూ మీతో కబుర్లు చెప్పిన మనిషి భోజనానికొచ్చేటప్పుడు కనీసం మీకు చెప్పనుకూడా లేదు. ఇక్కడ ఎవరి తొందర వారిది. ఇంకొకళ్లతో పెట్టుకుంటే కుర్చీలు దొరకవు మరి" అన్నది అనంతలక్ష్మి.

అప్పారావు శేషావతారాన్ని చూశాడు. ఎప్పుడు కనిపించి మాట్లాడినా తనకి బి.పి. ఉందనో షుగరనో లేకపోతే డాక్టరు కొలెస్ట్రాల్ పెరిగింది నూనె వాడద్దని చెప్పాడనో తన రోగాల చిట్టా విప్పే శేషావతారం బాదం హల్వాలో జిలేబీ నంజుకుంటున్నాడు. ఓర్నీ ఫ్రీగా వస్తే ఫినాయిలైనా తాగే రకమా నువ్వు అనుకున్నాడు అప్పారావు. అరగంట నుంచీ కుర్చీ కోసం వెదుకులాటలో కాళ్లు పీక్కుపోతున్నాయి అప్పారావుకి. దూరంగా ఓ కుర్చీ ఖాళీగా కనిపించటంతో ఆశగా అటువైపు వెళ్లి చూశాడు. ఆ కుర్చీ ఎవళ్లకో రిజర్వ్ చేసి ఉన్నట్టుగా అందులో కర్చీఫ్ వేసి ఉంది. రద్దీగా ఉన్న బస్సుల్లో, రైళ్లలో కర్చీఫ్‌లు వేసి సీట్లు ఆపడం తెలుసు గానీ ఇక్కడ కూడానా అనుకుని నీరసంగా తిరిగొచ్చాడు. ఓ పక్కన కాళ్లు లాగుతున్నాయి. వడ్డించుకున్న పదార్థాలతో పళ్లెం బరువెక్కి చేయి తిమ్మిరెక్కినట్టుగా అనిపిస్తోంది. పొద్దున్న ఎప్పుడో తిన్న రెండు ఇడ్లీముక్కలూ, పెళ్లివారిచ్చిన బుల్లి ప్లాస్టిక్ గ్లాసులో నాలుగు స్పూన్ల టీ చుక్కలూ తప్పితే కడుపులో ఏమీ లేదు. భర్త పరిస్థితి చూసిన అనంతలక్ష్మికి జాలేసింది. ఒకసారి నాలుగు వైపులా చూసింది. ఫస్ట్ రౌండ్‌లో తెచ్చుకున్న ఐటమ్స్ తినడం పూర్తి చేసి సెకండ్ రౌండ్ ఐటమ్స్ వేయించుకోవడం కోసం ఖాళీ పళ్లాన్ని పట్టుకొని బయల్దేరాడో ఆసామి. ఆయన అటు నాలుగడుగులు వేయగానే చటుక్కున కుర్చీ లాక్కొచ్చేసింది అనంతలక్ష్మి. "హాయిగా కూర్చుని తినండి" అన్నది.

"బాగోదేమోనే పాపం.. ఆయన... అన్యాయం కదే" అన్నాడు అప్పారావు.

"మాట్లాడకుండా తినండి" గుడ్లురిమింది అనంతలక్ష్మి.

"ఇదుగో ముందర స్వీట్లు తినకు అవి తింటే తరువాత ఏమీ తినలేవు. బిర్యానీ తిను. జీడిపప్పు పకోడీ తినెయ్ మళ్లీ వేయించుకుందువుగానివి. మధ్యలో అలా నీళ్లు తాగెయ్యకు. ఎక్కువ తినలేవు. అలా మొహమాటపడకు రెండొందలు పెట్టి గిఫ్ట్ కొనిచ్చాం కాబట్టి సుబ్బరంగా తిను. చివర్లో ఐస్‌క్రీం ఇస్తారు. ఇక్కడొకటి తినేసి వెళ్లేటప్పుడు ఇంకొకటి తింటూ బైటకెళ్లచ్చు. ఎవరూ ఏమీ అనుకోరు. పిల్లలకి కూడా మళ్లీ మళ్లీ పెట్టించి తినిపించు. అన్నీ చెపితే కానీ అర్థం కావు నీకు" భార్యతో చెబుతున్నాడో ఆయన. పక్కకుర్చీలో కూర్చున్న ఆయన ఎంత నెమ్మదిగా అన్నా అప్పారావు చెవుల బడ్డాయా మాటలు.

'ఓరి నీ కక్కుర్తి మండిపోనూ' అనుకున్నాడు అప్పారావు. హాయిగా తిన్న సంతృప్తి కలగలేదు అప్పారావుకి. తన చిన్నప్పుడు చేసిన పంక్తి భోజనాలు గుర్తొచ్చాయి. ఇలా సీట్ల కోసం కొట్టుకోవడం లేదు ఆ రోజుల్లో. దగ్గరుండి విస్తరి దగ్గరికి తీసుకెళ్లి కూర్చోపెట్టేవారు. హాయిగా నిదానంగా పెళ్లివారు వడ్డిస్తుంటే కడుపు నిండా తినే వాళ్లం. క్రమంగా ఆ పద్ధతి మారి టేబుల్ మీల్స్ వచ్చాయి. ఆ పద్ధతి కూడా బాగానే ఉండేది. ఇప్పుడు అది కూడా తగ్గిపోయి బఫే సిస్టం వచ్చింది. ఎవడి ప్లేటు వాడే ఎవడి మంచినీళ్లు వాడే తీసుకెళ్లి కూర్చోడానికి జాగా లేకపోతే ఏ మూలో నిలబడి తినాలి. ఏ పదార్థమైనా మళ్లీ తినాలనిపిస్తే తను కూర్చున్న కుర్చీ చూస్తుండమని పక్కవాళ్లకి చెప్పడమో ఆ కుర్చీ తనదని చెప్పడానికి ఏ కర్చీఫో పెట్టిపోవాలి. ఏమిటో మారే కాలంతో పాటు కొన్ని సంప్రదాయాలూ మారిపోతున్నాయి.


"ఏమండీ వెడదామా" అనంతలక్ష్మి పిలుపుతో అప్పారావు ఆలోచనల కడ్డుపడింది.

"అటెక్కడికి వెడుతున్నారూ.. తిన్న పళ్లాలు పడేసేదిటువైపు" ఓ పక్కగా ఉన్న డస్ట్‌బిన్‌వైపు నడుస్తూ అన్నది భర్తతో అనంతలక్ష్మి.

సగం తిని పడేసిన స్వీట్లు, తినలేక వదిలేసిన పెరుగు అన్నం కడుపు పట్టక వదిలేసిన పదార్థాలతో ఉన్న ఎంగిలి పళ్లాలన్నీ ఓ డస్ట్‌బిన్‌లో నిండి ఉన్నాయి. మనిషి మనసుకున్న కక్కుర్తి కడుపుకి లేదు. ఓ లిమిట్ దాటితే కడుపు తినలేదు...వేస్టుగా పడేసిన పదార్థాలని చూస్తూ అనుకున్నాడు అప్పారావు. చేతులు కడుక్కుని బైటకి వస్తుంటే సగం తిని పడేసిన ఐస్‌క్రీం కప్పులూ, ప్లాస్టిక్ మంచినీళ్ల గ్లాసులూ నేలమీద అస్తవ్యస్థంగా పడి ఉన్నాయి.

"ఇదుగో ఇక ముందు ఏ పెళ్లికెళ్లినా ఇలా అవస్థలు పడకూడదు. పక్కవాళ్లని చూసి తెలివితెచ్చుకోవాలి" అన్నది అనంతలక్ష్మి.

ఇప్పుడు అప్పారావు ఏ పెళ్లికెళ్లినా భోజనాలప్పుడు మాత్రం మొదటి రౌండ్‌లో మొదటి కుర్చీ తనే ఆక్రమించుకుంటాడు. హాయిగా భోంచేస్తాడు. పూర్వానుభవం కదా మరి!



## ఇంటివాళ్లవుతున్నారు

అభిషేక్ బచ్చన్-ఐశ్వర్య దంపతులు త్వరలోనే సొంతింటి వాళ్లవుతున్నారట. పెళ్లయిన దగ్గరనుంచీ అమితాబ్-జయ దంపతులతోనే 'జల్సా' భవనంలోనే కలిసి వుంటున్న ఈ తారాదంపతులు ఇకపై విడిగానే వుంటారట. ముంబాయి బాంద్రా ఏరియాలోని కార్టర్ రోడ్‌లో తమ అభిరుచికి అనుగుణంగా అత్యంత విలాసవంతమైన భవనాన్ని నిర్మించుకుంటున్నారు. అదిప్పటికి పూర్తి కావచ్చిందిట. అన్నీ సవ్యంగా వుంటే వచ్చేనెల్లోనే గృహప్రవేశం చేసే వుద్దేశంలో వున్నారట అభి-ఐష్‌లు.